ప్రజాస్వరం
PRAJASWARAM
తెలుగు దినపత్రిక

Bullet Edition


ఆదివారం 13 ఏప్రిల్ 2025 www.prajaaswaramdaily.com 2 pm

# జయశంకర్ భూపాలపల్లి జిల్లాలో విషాదం

## కార్పెంటైన్ ఆయిల్ తాగి చిన్నారి మృతి



జయశంకర్ భూపాలపల్లి : మంచి నీళ్లు అనుకొని పొరపడి పెయింట్ ఆయిల్ ను తాగిన చిన్నారి మృతిచెందిన సంఘటన జయశంకర్ భూపాలపల్లిలో జరిగింది. కాటారం మండలం ధన్వాడ గ్రామానికి చెందిన మాజీ ఎంపీటీసీ బోడ మమత, నరేష్ భార్యభర్తలు.. వీరికి ఇద్దరు కుమారులు ఉన్నారు. చిన్న కుమారుడు సుహాన్ తల్లితో కలిసి బంధువుల ఇంటికి వెళ్లాడు. అక్కడ మమత రంగులతో ముగ్గులు వేస్తూ ఉండగా, సుహాన్ ఆడుకుంటూ ఇంటి చుట్టుపక్కల తిరుగుతూ, గదిలోని ఒక మూలకు వెళ్లాడు. అక్కడ పెయింట్ బ్రష్‌లు కడిగేందుకు ఉంచిన కార్పెంటైన్ ఆయిల్‌ను గ్లాసులో పోసి పెట్టి ఉండటాన్ని, అది మంచినీళ్లుగా భావించి తాగేశాడు. ఈ దృశ్యాన్ని ఎవరూ గమనించేలోపే, చిన్నారి అస్వస్థతకు గురయ్యాడు. అప్పటికి అక్కడ ఉన్నవారు షాక్‌కు గురై వెంటనే హుటాహుటిన సమీపంలోని ఆసుపత్రికి తరలించారు. వైద్యులు ఎంతగా ప్రయత్నించినా, చిన్నారి ప్రాణాలు నిలువలేకపోయాయి. చిన్నారి మృతదేహాన్ని చూసిన తల్లిదండ్రులు మమత, నరేష్ తీవ్రంగా కన్నీరు మున్నీరయ్యారు.




## తజకిస్థాన్, మయన్మార్ లలో

# భూకంపం

తజకిస్థాన్ : తజకిస్థాన్‌లో ఆదివారం ఉదయం భారీ భూకంపం సంభవించింది. రిక్టర్ స్కేల్‌పై దీని తీవ్రత 6.4 పాయింట్లుగా నమోదైంది. ఆదివారం ఉదయం 9.54 గంటల ప్రాంతంలో భూమి కంపించడంతో జనం భయాందోళనకు గురయ్యారు. ఇళ్లల్లో నుంచి బయటకు పరుగులు తీశారు. భూకంప కేంద్రాన్ని 10 కిలోమీటర్ల లోతులో ఉన్నట్లు గుర్తించినట్లు అధికారులు తెలిపారు. మయన్మార్‌లో నేడు మరోసారి భూకంపం సంభవించింది. ఇక్కడి మీక్టిలియా ప్రాంతంలో 5.5 తీవ్రతతో భూ ప్రకంపనలు వచ్చాయని అధికారులు తెలిపారు.

## ఆ ఎంపీ పేరు చెప్పే

# దమ్ముందా?



**ఆయన వెనకుండి ప్రభుత్వాన్ని నడిపిస్తున్నాడన్న కేటీఆర్ ఆరోపణలపై మంత్రి పొన్నం కౌంటర్**

**దమ్ము, ధైర్యం లేవా అంటూ ప్రశ్నించిన ప్రజాప్రతినిధి**

**కంచ గచ్చిబౌలి భూములపై విమర్శలు అర్థరహితమని వ్యాఖ్య**

హైదరాబాద్ : కంచ గచ్చిబౌలి భూములకు సంబంధించి బీజేపీ ఎంపీ వెనకుండి ప్రభుత్వాన్ని నడిపిస్తున్నాడన్న కేటీఆర్ ఆరోపణలపై మంత్రి పొన్నం ప్రభాకర్ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆ ఎంపీ పేరు చెప్పే దమ్ము, ధైర్యం లేదా అని కేటీఆర్ ను ప్రశ్నించారు. కంచ గచ్చిబౌలి భూములకు సంబంధించి ప్రతిపక్షాలు చేస్తున్న ఆరోపణలపై స్పందించారు. బీఆర్ఎస్, బీజేపీ చేస్తున్న విమర్శలను తిప్పికొట్టారు. మాజీ మంత్రి కేటీఆర్ ఆరోపణలు అర్థరహితమని కొట్టిపారేశారు. కేటీఆర్ మాట్లాడేది ఆయనకే అర్థం కావడం లేదని అన్నారు. రాష్ట్రంలో మళ్లీ అధికారంలోకి వస్తామని కేటీఆర్ కలలు కంటున్నారని ఎద్దేవా చేశారు. బీజేపీ నేతలు అవివేకంతో ఇష్టారీతిన మాట్లాడుతున్నారని మంత్రి పొన్నం విమర్శించారు. సీఎం మార్పుపై ప్రకటనలు చేస్తూ వాళ్ల అవివేకాన్ని బయటపెట్టుకుంటున్నారని అన్నారు. ఒకవేళ సీఎంను మార్చాలని అధిష్టానం నిర్ణయం తీసుకుంటే కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌ఛార్జ్ మీనాక్షి నటరాజన్ ఎప్పుడో ప్రకటన చేసేవారని మంత్రి పొన్నం ప్రభాకర్ వివరించారు.



# పెద్దగా పట్టించుకోను

## నటి మౌనీరాయ్

సినిమా: అందం కోసం మౌనీరాయ్ సర్జరీ చేయించుకున్నారు.. దాంతో ముఖ కవళికలు మారిపోయాయని కామెంట్స్ చేశారు. 'ది భూత్నీ' సినిమా ఈవెంట్‌లో ఆమె పాల్గొన్న నాటి నుంచి ఈ విమర్శలు వెల్లువెత్తాయి. నెట్టింట వైరల్‌గా మారిన ఈ విమర్శలపై తాజాగా ఆమె స్పందించారు. వీటిని తాను ఏమాత్రం పట్టించుకోనన్నారు. "నాపై కామెంట్స్ చేసేవాళ్లు నాకు కనిపించరు. కాబట్టి వాళ్ల మాటలకు బాధపడాల్సిన అవసరం లేదు. వాటిని పెద్దగా పట్టించుకోను. ఇతరులను ట్రోల్ చేస్తూ ఆనందాన్ని పొందాలనుకుంటే మాత్రం మనం ఏం చేస్తాం. ఎవరికి నచ్చినట్లు వాళ్లని ఉండనివ్వండి" అని అన్నారు.

'నాగిని' సీరియల్‌తో అన్ని భాషల్లో అభిమానులను సొంతం చేసుకున్నారు. అక్షయ్‌కుమార్ నటించిన 'గోల్డ్' చిత్రంతో వెండితెరకు పరిచయమయ్యారు. 'బ్రహ్మాస్త్ర' చిత్రంలో నెగెటివ్ షేడ్స్ ఉన్న పాత్రలో కనిపించారు. ప్రస్తుతం ఆమె 'ది భూత్నీ'లో నటిస్తున్నారు. సంజయ్ దత్ ప్రధాన పాత్రలో నటించిన ఈ హారర్ మూవీ ఏప్రిల్ 18న విడుదల కానుంది. ఈ సినిమా తనకు చాలా ప్రత్యేకమని మౌనీ ఇటీవల ఓ కార్యక్రమంలో తెలిపారు. ఇందులోని స్టంట్స్ కోసం డూప్‌ను ఉపయోగించలేదని.. తానే స్వయంగా చేశానని చెప్పారు.

## పెట్టుబడులకు ఫ్యూచర్ సిటీ

# అనుకూలం

## మంత్రి ఉత్తమ్



హైదరాబాద్: పెట్టుబడులకు అనుకూలంగా ఫ్యూచర్ సిటీని తీసుకొస్తున్నాం. మూసీ ప్రక్షాళన చేపట్టి పరివాహక ప్రాంతాన్ని అభివృద్ధి చేస్తాం. సైబరాబాద్ బిల్డర్స్ అసోసియేషన్‌కు మేం మరింత భరోసా ఇస్తున్నాం. మరింత లాభాలు వచ్చేలా అభివృద్ధి చేస్తాం. పెట్టుబడులు వస్తున్నాయి.. మరిన్ని భవనాలు నిర్మించండి. ప్రభుత్వంలో బిల్డర్స్ ఎప్పటికీ భాగస్వాములుగానే ఉంటారు. ప్రభుత్వ అభివృద్ధిలో మీ పాత్ర ఎప్పటికీ ఉంటుంది. ప్రజా ప్రభుత్వం వెన్నుదన్నుగా ఉంటుంది'' అని ఉత్తమ్‌కుమార్ రెడ్డి అన్నారు.

నిర్మాణ రంగం అభివృద్ధికి ప్రభుత్వం కట్టుబడి ఉందని మంత్రి ఉత్తమ్ కుమార్‌రెడ్డి అన్నారు. బిల్డర్ల సమస్యలు పరిష్కరించేందుకు సిద్ధంగా ఉన్నామని చెప్పారు. ఆదివారం నిర్వహించిన 'సైబరాబాద్ బిల్డర్స్ అసోసియేషన్' వార్షికోత్సవ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా మంత్రి ఉత్తమ్ హాజరయ్యారు. పీఏసీ చైర్మన్ అరికెపూడి గాంధీ, సీఎం సలహాదారు వేం నరేందర్‌రెడ్డితో కలిసి ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడారు.

''హైదరాబాద్ అభివృద్ధికి బిల్డర్లు కృషి చేయాలి. నగరంలో మౌలిక సదుపాయాల కల్పనకు కాంగ్రెస్ పార్టీ ఎంతో చేసింది. శంషాబాద్ ఎయిర్‌పోర్టు, ఔటర్ రింగ్‌రోడ్డు, కృష్ణా–గోదావరి జలాల తరలింపు గతంలో కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలోనే అయ్యాయి. ఈ అభివృద్ధిని ప్రభుత్వం మరింత ముందుకు తీసుకుపోతుంది. ప్రజారవాణా కోసం మెట్రోను అభివృద్ధి చేస్తున్నాం. హైదరాబాద్‌ను మరో సిలికాన్ వ్యాలీగా తీర్చిదిద్దుతాం. అని అన్నారు.

# రేపు ఎస్సీ జీవో విడుదల

**మంత్రి ఉత్తమ్ కుమార్ వెల్లడి**

**ఈరోజు ఆయన అధ్యక్షతన సబ్ కమిటీ భేటీ**

**పొన్నం, దామోదర, షమీమ్ అక్తర్, అధికారులు హాజరు**

**రేపు కూడా సమావేశం**

హైదరాబాద్ : ఎస్సీ వర్గీకరణపై కేబినెట్ సబ్ కమిటీ చైర్మన్, మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి అధ్యక్షతన సచివాలయంలో ఇవాళ సమావేశం ప్రారంభమైంది. ఈ భేటీలో మంత్రులు పొన్నం ప్రభాకర్, సతక్క, సబ్ కమిటీ వైస్ చైర్మన్ దామోదర రాజనర్సింహతో పాటు ఎస్సీ వర్గీకరణ ఏకసభ్య కమిషన్ విశ్రాంత న్యాయమూర్తి జస్టిస్ షమీమ్ అక్తర్, ఇతర ముఖ్య అధికారులు హాజరయ్యారు. ఇప్పటికే ఎస్సీ వర్గీకరణ బిల్లు తిరిగి ప్రభుత్వానికి చేరిన నేపథ్యంలో కేబినెట్ సబ్ కమిటీ మరోసారి భేటీ అవ్వడం ప్రాధాన్యతను సంతరించుకుంది. కేబినెట్ సబ్ కమిటీ చైర్మన్, మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ.. రేపు ఉదయం 11 గంటలకు మరోసారి కమిటీ భేటీ అవుతుందని తెలిపారు. రేపు ఎస్సీ వర్గీకరణ జీవోను విడుదల చేస్తామని ప్రకటించారు. దీంతో ఎస్సీ ఉప కులాలకు 15 శాతం రిజర్వేషన్లు వర్తించనున్నాయి. ఎస్సీల్లో ఉన్న మొత్తం 59 ఉప కులాలను మూడు గ్రూపులుగా విభజించి కేటాయింపులు చేశారు. సామాజికంగా, విద్యాపరంగా, ఆర్థికంగా పూర్తిగా వెనుకబడిన వారిలో 15 ఉప కులాలు ఉన్నాయని గుర్తించి గ్రూప్-1 కింద ఒక శాతం, మధ్యస్థంగా లబ్ధి పొందిన 18 ఉప కులాలకు గ్రూప్-2 కింద 9 శాతం, గణనీయంగా లబ్ధి పొందిన 26 ఉప కులాలను గ్రూప్-3 కింద 5 శాతం రిజర్వేషన్లను ప్రభుత్వం కేటాయించింది.